ఒరులేయవి యొనరించిన

సదా గగనయానం చేసే నారద మునీంద్రుల వారు ఆకాశంలో పయనిస్తూ క్రిందికి ఒకసారి చూశారట. అప్పుడాయనకు కన్పించినది, తన అరుగుమీద నిల్చుని, ఒక చేతిలో చేతికర్రతో, మరొక చేతిలో పంచాంగంతో, శుద్ధ వైదిక వేషంలో పంచే వోణి వేసుకుని, మెడలో రుద్రాక్షమాలా, నుదుట కొట్టవచ్చి నట్లు కన్పించే విభూతీ కుంకంబొట్టుతో, పెరిగిన గడ్డంతో, పిలకతో, సన్నగా, పొట్టిగా ఉన్న ముప్ఫైఅయిదేళ్ల బుచ్చిశాస్త్రి సరిగ్గా ప్రయాణమవబోతున్న దృశ్యం! అతనినిచూసి, నారదుల వారు, "అమ్మయ్య! నేను భూలోకం వెళ్ళలేదని దిగులులేదు. నా ప్రియశిష్యుడు బుచ్చిశాస్త్రి నాకు మనసారా తృప్తి కలిగిస్తు న్నాడు. ఇప్పు డతను వెళ్తున్న కార్యం చక్కగా నిర్వహింపబడు గాక!" అని ఆశీర్వదించారట.

ఆ విషయం తెలియని బుచ్చిశాస్త్రి కొంచెం దిగులుగా "వెళ్తున్నా! తలుపు వేసుకో" అని ఆఖరిసారి భార్యను హెచ్చరించి, శకునం విమర్శించి చూసుకుని తన గుమ్మం దిగి నడవ నారంభించారు. ఆయన పౌరోహితుడనీ, ఆయన ఇల్లు ఆ పట్టణంలోనే ఒక పేటలో ఉందనీ, ప్రస్తుతం దగ్గరలో ఉన్న ఒక గ్రామానికి అత్యవసర కార్యంమీద వెళ్తున్నారనీ చెప్పడం అప్రస్తుతం కాదు. అయినా నారదులవారిని హర్షింపజేసిన విషయ మేమిటంటే బుచ్చిశాస్త్రి వెళ్తున్నది సింగిపురంలోని

పంతులుగారింటికి. ఆ పంతులుగారి అమ్మాయిని విజయనగరంలో ప్లీడరుగారైన హనుమయ్యగారి మూడో అబ్బాయికి అయిదేళ్ళ క్రితం వివాహం చేయించినప్పటినుంచీ ఆ రెండు కుటుంబాలమధ్యా కలతలూ, కలహాలూ, వైషమ్యాలూ, పగలూ విపరీతంగా పెరిపోయాయి. వియ్యంకులిద్దరికీ మధ్య పచ్చగడ్డివేస్తే భగ్గున మండుతుంది. హనుమయ్యగారు వియ్యం కుడిమీద కోపంకొద్దీ కొడుకూ కోడలూ అన్యోన్యంగా కాపరం చెయ్యకుండా పేచీలు పెడుతున్నాడని — పంతులుగారి ఆరోపణ! పంతులుగారు, తన కొడుకును తననుంచి వేరుచెయ్యాలని చేస్తున్న ప్రయత్నాలు తనకు తెలుసుననీ, ఆ పప్పులు తనదగ్గర ఉడకవనీ — హనుమయ్యగారి సవాలు. వీరిద్దరి తగవులవల్లా ఆ దంపతుల కాపురంలో సుఖశాంతులు లేకుండాపోయాయి. పెళ్ళి పీటలమీద హనుమయ్యగారు, కట్నం చాలదనీ, లాంఛనాలు సరిగా జరుపలేదని ప్రారంభించిన పేచీ, ప్రతి చిన్న విషయం లోనూ కయ్యాలతో సాగి, నలుగురి నోళ్ళలోబడి చూసేవారి కొక వింత, అనుభవించేవారి కొక నరకంగా పరిణమించింది. పంతులుగారి కూతురైన శారదకు అత్తవారిల్లు కంటకప్రాయం అయిపోయి మామగారనే మాటలు భరించలేక, ఎందులోనైనా దూకుదా మనిపించేది. ఆమెభర్త రఘురాం సాత్వికుడు. తండ్రిని వారించలేక, తనలో తను దిగులు పెంచుకుని, మతి పోగొట్టుకున్నాడు. అది శారదకు మరింత దుస్తరవేదనగా మారింది.

అసలు ఇన్ని పేచీలకు కారణం, పంతులుగారూ, హనుమయ్యగారే కాని, మరో విషయాలేమీకావు. ఇద్దరూ హేమాహేమీలు, తగవులూ, డబాయింపులూ, కుయుక్తులు, వారికి ఉగ్గుపాలతో అబ్బిన విద్యలు. వీ రిద్దరికీ దూరపు చుట్టరికం ఉన్నా, వీ రిద్దరూ వియ్యం పొందడానికి మాత్రం బుచ్చిశాస్త్రి కారణం. అసలు ఇటువంటి ఇద్దరు విశిష్టవ్యక్తులు వియ్యం పొందుతే చూడాలని అతగాడి వాంఛ!

ఎందుకంటే, మొదట హనుమయ్యగారి గురించి చెప్పుకుందాం. ఆయన విజయనగరంలో పేరు పొందిన క్రిమినల్ వకీలు. ఆస్తి బాగా సంపాదించాడు. ఆస్తి'న్నా మనిషిలో డాబూ, దర్పం ఎక్కువ. మనిషి పొడుగ్గా, ఎర్రగా, జబర్దస్తీగా ఉంటాడు. ఆయన దగ్గరకు వచ్చిన క్లయింట్లు బాగా డబ్బున్నవాళ్లయి ఉండాలిగాని, సామాన్యులు లాభంలేదు. ఆయనవి విపరీతమైన ఖర్చులు, అంతా జమీందారీ ఫాయాలో ఉంటుంది సంసారం. మనిషిలో పట్టుదల హెచ్చు. అన్యాయానికీ, అక్రమానికీ, డబాయింపుకీ వెనుదియ్యడు. ఇద్దరు స్త్రీలు, విధవలై తమ అత్తింటివారు భర్తల ఆస్తిని స్వాహా చేస్తున్నారనీ, అవి తమకు దక్కేటు చెయ్యమని ఆయన వద్దకు వస్తే, కేసులు నడిపించి గెల్చి ఆస్తులు స్వాధీనం చేసుకోవడమే కాకుండా ఆ ఆస్తుల్ని తను కాజేసి, వాళ్లని పూర్తిగా బోడుల్ని చేసి పంపిన మహానుభావుడు. ఇంకా ఇలాంటి ఎన్నో లెక్కలేనన్ని సంఘటనలు, అయితే, ఇంత సంపాదనకూ మించిన ఖర్చు లతనికి

ఉన్నాయనీ, ఆ స్తితో బాటు అప్పుకూడా పెరుగుతోందని కొద్ది మందికి తెలుసు. ఆ కొద్దిమందిలో బుచ్చిశాస్త్రి ఒకడు.

ఇహ కాంతారావు పంతులుగారంటే సింగిపురంలో లక్షాధికారి. ఆ చుట్టుప్రక్కల ఉన్న భూముల్లో సగం అతనివే, కాని, పరమలోభి. వడ్డీ వ్యాపారంకూడా చేస్తూంటాడు. పిల్లికి బిచ్చం పెట్టడు... బంధువెవరైనా భోజనానికి వస్తే, భోంచేస్తూండగా "ఇదిగో! ఇదే వి స్తరి, హోటల్లో వేస్తే పూటకు ముప్పావలా తీసుకుంటారు, నా యిల్లు బొత్తిగా సత్రమై పోతుంది..." అంటూ, మళ్లీ ఆ వ్యక్తి 'జన్మలో ఇక్కడికి రాకూడ' దనేటట్లు చేస్తాడు. తనక్రింద పనిచేసే గుమస్తాల్నీ, కంబార్లనీ, పీల్చి పిప్పిచేసేస్తాడు. వాళ్లకు అంతకన్నా గతిలేక పడుంటారు. సింగిపురం గ్రామంలో అందరూ అతనికి వ్యతి రేకమే. రైతుల్ని నానాదుర్భాషలూ ఆడి, ఏమాత్రం పంట వాళ్లు సరిగ్గా ఇవ్వకపోయినా కోర్టుకీడుస్తాడు. రెండు మూడు సార్లు, అర్ధరాత్రి అతన్ని ఎవరో చావగొట్టారు. అయినా అతని పద్ధతి మారలేదు. అందరితోనూ తగాదాలే అందరిమీద దావాలే. అతనితో వ్యవహారమంటే అందరికీ భయం. కోర్టుకి ఎంత ఖర్చయినా వెనుదియ్యకుండా ఎగబడతాడు. అవతల వాణ్ణి నాశనం చెయ్యందే వదలడు. అతని ఇంటి పౌరో హిత్యం, తాతలనాటి నుండి వస్తోంది కాబట్టి వదలలేక వెళ్లడం గాని, బుచ్చిశాస్త్రికి ఎంత మాత్రం ఇష్టంలేదు. ఎందుకంటే, పంతులుగారిచ్చే దక్షిణ, బుచ్చిశాస్త్రి బస్సుఖర్చుకి కూడా సరిపోదు. అయినా పరువుకోసం వెళ్తూంటాడు.

ఇద్దరూ ధనవంతులు కాబట్టి, పంతులుగారి ఏకైకపుత్రికను హనుమయ్యగారి మూడో అబ్బాయికిచ్చారు. ఈ పెండ్లి సంధాన కర్త బుచ్చిశాస్త్రీను. పంతులుగారి రోగం కుదర్చాలనే ఉద్దేశంతో వారికి, పేచీలలోను, కోర్టు వ్యవహారాలలోనూ సమఉజ్జీ అయిన హనుమయ్యగారితో వియ్యాం కుదిర్చాడు గాని, శారద రఘురాంల అవస్థలు చూస్తుంటే, హనుమయ్యగారు చాలా అన్యాయంగా ప్రవర్తిస్తున్నారని బుచ్చిశాస్త్రికి అనిపించేది. తక్కిన కొడుకుల్ని, కోడళ్లనీ ఆదరంతో చూసే హనుమయ్యగారు, శారదను నానాహింసలూ పెట్టడమే కాక, రఘురాం శారద నేమాత్రం ఆపేక్షగా చూసినా మండిపడి పోయేవారు. ఆ యింట్లో, పనిమనిషికన్నా హీనంగా పనిచేస్తూ, చిక్కి శల్యమై, మతిలేని భర్తను వదలలేక, దిగులుగా ఉండే శారదను చూస్తూంటే బుచ్చిశాస్త్రి హృదయం తరుక్కుపోయేది. ఈ పరిస్థితి కేదైనా నిష్కృతి నాలోచించాలనుకునేవాడు. హనుమయ్యగారి ఏకైక పుత్రిక మనోరమ వివాహ ప్రసక్తి వచ్చిన దగ్గర్నుండి బుచ్చిశాస్త్రి మెదడు అమోఘంగా పనిచెయ్యసాగింది.

కోట దాటి మూడు లాంతర్ల వైపు వెళ్లబోతున్న బుచ్చిశాస్త్రికి ఒక సన్నటి, ఎర్రటి ఇరవై ఏళ్ల యువకుడు ఎదురుపడ్డాడు. అతని జుట్టు దిలిప్‌కుమార్‌లా మొహంమీద పడ్తోంది. కళ్లు ఎర్రగా ఉన్నాయి. చూపు ఎక్కడో వుంది.

టెర్లిన్ షర్టు బాగా నలిగిపోయింది. రేయాన్ పాంటు దుమ్ము అంటుకున్నట్లుంది. సాయంకాలం అయిదు గంటలకు, కాలేజీ విద్యార్థి అయిన ఆ అబ్బాయి, ఆ ప్రదేశంలో ఆ స్థితిలో కన్పించటం బుచ్చిశాస్త్రికి, ఆశ్చర్యం వేసింది. తనే పలకరించాడు.

''ఏమోయి సూర్యం! నేను మీ ఊరే వెళుతున్నాను. నాన్నగారితో ఏమైనా చెప్పమన్నావా ?'' అని, ఆ అబ్బాయిని ఆపి అడిగాడు.

సూర్యం పరధ్యాన్నంగా, ఆఁ! అన్నాడు. బుచ్చిశాస్త్రి తన మాటల్ని మరొకసారి అన్నాడు, అప్పుడా అబ్బాయి కాస్త ఆలోచించి, ''నేను ఆత్మహత్య చేసుకోబోతున్నానని చెప్పండి'' అని విసురుగా వెళ్ళిపోబోయాడు. బుచ్చిశాస్త్రి ఆశ్చర్యంగా, ఆ ! ఆ! అవేం మాటలోయ్?'' అంటూ అతని ప్రక్కనే నడుస్తూ, మీ నాన్నగారు కోపధారి మనుష్యులు, ఆయన కోపంలో ఏదైనా అంటే నువ్విలా తలపెట్టడం భావ్యం కాదు... అని నచ్చచెప్పూంటే, సూర్యం మెల్లిగా నడుస్తూ. ''నన్నాయన ఏమీ అనలేదు. కానీ నాకే ఈ ప్రపంచం అంటే రోత పుట్టేసింది. ఈ మనుషులంటే అసహ్యం వేస్తోంది. నేనిక జీవించదల్చుకోలేదు'' అన్నాడు.

బుచ్చిశాస్త్రి ఈ వ్యవహారం తనూహించిన దానికన్నా క్లిష్టమైనదని గ్రహించాడు. ''కాస్త కాఫీతాగొద్దాం, పద!'' అని సూర్యాన్ని కాఫీహోటలుకు తీసుకువెళ్ళి, ''అసలు విషయ

మేమిటో చెప్పు?'' అని అడిగాడు. ముందర బెట్టు చేసినా తరు వాత సూర్యం మెల్లిగా బయటపెట్టాడు. తను కాలేజీలో ఒక అమ్మాయిని ప్రేమించాననీ, ఆమె తనను నిరాకరించిందనీ, అందువలన తను ప్రాణత్యాగం చెయ్యదల్చుకున్నాననీ, అందుకు ఇంకా కారణాలున్నాయనీ చెప్పాడు.

ఈ రోజుల్లో యువతీ యువకులు ఎంతసులభంగా ఆత్మ హత్యకు తెగిస్తారో తెలిసిన బుచ్చిశాస్త్రి, సూర్యం భుజంతట్టి, "ఓస్! ఇంతేటయ్యా! నువ్వెవర్ని ప్రేమించావో చెప్పు? ఆ అమ్మాయిని నీకిచ్చి వివాహం జరిపే ఏర్పాటు చేయిస్తాను'' అన్నాడు.

లాభంలేదన్నట్లు తలూపాడు సూర్యం. "ఆ అమ్మాయి ఎవరో అయితే ఫరవాలేదు. మనమంటే బొత్తిగా పడని కుటుం బంలోది. అందుచేత లాభంలేదు'' అని గట్టిగా చెప్పాడు. సూర్యం చాలా ఉద్రేకస్వభావం గలవాడేకాక, చాలా విషయా లలో, తండ్రైన కాంతారావుగారికి వ్యతిరేకి. సృష్టిచిత్రమే అటు వంటిది. కేపిటలిస్టు తండ్రులకు సోషలిస్టు కొడుకులు, కాంగ్రెసు అన్నలకు కమ్యూనిస్టు సోదరులూ, శాఖాహార భర్తలకు మాంసాహార భార్యలూ తటస్థ పడుతూంటారు. అదేవిధంగా లుబ్ధాగ్రేసరుడూ, పరమ పేచీకోరూ అయిన పంతులుగారికి ఖర్చుదారూ, సున్నిత స్వభావుడూ, భావకవీ అయిన సూర్యం ప్రథమ పుత్రరత్నం. అంతేకాకుండా రోమియో, జూలియట్‌ల కుటుంబాల మధ్య విరోధం ఉందని తెలిసికూడా, రోమియో,

జూలియట్‌ని ప్రేమించినట్లు. సూర్యం తన కుటుంబానికి ఇష్టం వుండదని తెలిసికూడా, మనోరమను ప్రేమించాడు. ఆమె హనుమయ్యగారి పుత్రిక. కాలేజీలో పి. యు. సి. చదువుతున్న పద్దెనిమిదేళ్ళ చక్కనిచుక్క. సూర్యంయొక్క ప్రేమలేఖ అందుకున్న మరుక్షణమే దాన్ని చించిపారేసి, అతనికి విన్పించేట్లు, 'ఇదే నా జవాబు' అంది. ప్రేమలేఖతో బాటు. సూర్యం హృదయం కూడా ముక్కలైపోయింది. ఈ సంగతి విన్న బుచ్చిశాస్త్రి "అబ్బాయి, నువ్వెందుకు విచారించవలసిన పని ఎంతమాత్రం లేదు. నిన్నెలాగ చిన్నప్పటినుంచీ ఎరుగుదునో, అలాగే మనోరమనుకూడా ఎరుగుదును నువ్వు దిగులుపడకు. మీ ఇద్దరికీ వివాహం జరిపించే పూచీ నాది" అని సూర్యానికి మరీ మరీ ధైర్యంచెప్పి, సూర్యాన్ని ఎలాటి అఘాయిత్యమూ జరపవద్దని బోధించి, సింగిపురం వెళ్ళే బస్సెక్కాడు.

తను వేసుకున్న పథకంలో మొదటిఎత్తు దిగ్విజయంగా సాగినందుకు బుచ్చిశాస్త్రికి భుజాలు పొంగిపోయాయి సూర్యానికి పిల్ల నచ్చుతుందో లేదో అన్న బెంగలేకుండా సూర్యమే ఆ అమ్మాయిని ప్రేమించాడు. ఇక పెద్దలసంగతి : వాళ్ళ నెలా కదిలించాలో తనకు తెలుసు.

మరునాడు సింగిపురంలో, పంతులుగారింట్లో సత్యనారాయణ వ్రతం చేసుకున్నాక, భోజనాలవద్ద కాంతారావుపంతులుగారు బాతాఖానీ ప్రారంభించారు. ఆయనకు ఏభై ఏళ్ళుంటాయి

జుట్టు నెరసినా రంగు వేయడంవల్ల కొంత నల్లగా కన్పిస్తుంది. ఆయన ఎర్రగా పొట్టిగా ఉంటారు. మాటమాటకూ కన్ను కొట్టడం, పాక్యాని కొక తిట్టు ప్రయోగం ప్రయోగించడం ఆయన కలవాటు. కొంచెం నవ్వుకూడా జోడిస్తూంటారు.

"ఏవిటోయ్, విజయనగరం విశేషాలు ?" అని అడిగా డాయన ఒక కన్నుమూసి, ఒక కన్ను ఎగరవేస్తూ, చిన్న చిరు నవ్వుతో.

"మీ అబ్బాయి బాగానే ఉన్నాడు" అన్నాడు బుచ్చి శాస్త్రి మామిడిపండు చీకుతూ.

"ఆ వెధవాయ్ సంగతి ఎవడడిగాడు ? అమ్మాయి అత్త వారింట్లో సంగతడుగుతూంటేనూ—మా అల్లుడి వంట్లో ఎలా గుంది ?"

"అతనిస్థితి అలాగేవుంది. దాంతో బాటు హనుమయ్య గారికికూడా దిగులెక్కువై పోయింది".

"ఏం ? ఖూనీ కేసులు తక్కువయ్యాయా ?"

"అబ్బే పెళ్ళీడుకొచ్చిన పిల్లకు తగిన సంబంధం దొరక్క అవస్థపడుతున్నారు వారి ఫాయాకి తగిన సంబంధం కావాలి. కదండీ !"

"ఏమిటీ పిల్ల పెళ్ళిచేస్తాడా ! ఇహ తెలుస్తుందిలే అయ్య గారి పని. ఆ వచ్చే వాళ్ళెవరో మాంచి గడుసువాళ్ళు రావాలి. ఈయన్ని నానాగడ్డి గరిపించాలి నాలాటి వాడైతే......"

"అదే నేనూ అన్నానండి. మీ సంబంధమైతే దివ్యంగా వుంటుందని అన్నానండి" అన్నాడు బుచ్చిశాస్త్రి మధ్యలో అడ్డువచ్చి.

"మా సంబంధమా ?" అని పంతులుగారు తెల్లబోయారు మళ్ళీ కోపంతో, "ఆ అప్రాచ్యుడితో మళ్ళీ సంబంధం చెయ్యమంటావా ? నీ కేమైనా బుద్ధి, జ్ఞానం ఉందా ? వాణ్ణి ఏంచేసినా పాపం ఉందా ? పరమ దుర్మార్గుడు..." అని పావుగంటసేపు పంతులుగారు హనుమయ్యగారిమీద మండిపడ్డారు. ఆయనకు కోపం వచ్చిందంటే మరి ఆపుకోలేరు. భోజనాలయ్యేదాకా ఆయన వాళ్ళని తిడ్తూనేవున్నాడు. బుచ్చిశాస్త్రి మౌనంగా వింటూనేవున్నాడు.

తాంబూలం వేసుకుంటున్నప్పుడు, బుచ్చిశాస్త్రి ప్రారంభించాడు. "అయ్యా పంతులుగారు! నేను మీ శ్రేయస్సు గోరే ఈ సంబంధం చెప్పాను. ఒకటి మీరు జమీందారులూ, వారు మీహోదాకి తగినవారే, ఆయనకీ ఒక్కర్తే కూతురు కట్న కానుకలు ఘనంగా ఇవ్వదల్చుకున్నారు. ఇహ రెండవ సంగతి ఇన్నాళ్లూమీఅమ్మాయి వారింట్లో నానా కష్టాలూ పడ్తోంది. ఇప్పుడువారమ్మాయి మీ కోడలయిందంటే, వాళ్ల జుట్టు మీచేతిలోకి వచ్చినట్లే. తన కూతుర్నెలా చూస్తారో ? అని హనుమయ్యగారు బెంగపెట్టుకుని, మీ అమ్మాయిని బాగా చూడటం ప్రారంభిస్తారు. మిమ్మల్ని వాళ్లెన్ని తిప్పలు పెట్టారో,

అన్ని తిప్పలు వాళ్లిప్పుడు పడతారు ...'' అని బోధిస్తూంటే క్రమంగా పంతులుగారి మనసు మారసాగింది చాలాసేపు ఆలోచించాక—

''నిజమేనయ్యా! ఈ దెబ్బతో హనుమయ్యకు బుద్ధి వచ్చేటట్లు చేస్తాను. మా అమ్మాయిని వాళ్లెలా హింస పెట్టారో, తన కూతురుద్వారా తనకు తెలిసేట్లు చేస్తాను. పెళ్లిలో వాళ్లు పెట్టిన పేచీలన్నిటికీ ఇప్పుడు సమాధానం చెప్తాను" అని ఉద్రేకంతో అన్నారు. అని, ''అయితే ఇంతకూ హనుమయ్య ఏమాత్రం కట్నం ఇస్తాడు?'' అని అడిగాడు.

''ఇంతని అనటంలేదుగాని, చాలా భారీగానే ఇవ్వదల్చుకున్నారు. మీరు-- ఇంతకావాలని అంటే, వారితో చెప్తాను'' అన్నాడు బుచ్చిశాస్త్రి.

పంతులుగారు ఆలోచనలో పడ్డారు. ప్రతివిషయంలోనూ హనుమయ్యగారికి తను పాఠంచెప్పాలి కట్నం గురించి ఆయన చేసిన హంగామాకి తను చక్కని పాఠం చెప్పాలి. ఒకవిషయం మాత్రం రూఢని అందరికీ తెలుసు. మనోరమ అంటే హనుమయ్యగారికి వెర్రి అభిమానం ఆమె వివాహానికి ఆయన ఏ లోటూ రానివ్వరు. కాబట్టి కట్నం వేరే అడగక్కర్లేదు. "ఆయనకు తోచినంతే ఇవ్వమను" అన్నారు కన్నుకొట్టూ, వెకిలిగా నవ్వుతూ.

"భేష్! అలా అన్నారంటే, మీకు కట్నమూ బాగా ముడ్తుంది. ఆయనకు బాగా బుద్ధిచెప్పినట్లూ అవుతుంది" అన్నాడు బుచ్చిశాస్త్రి.

"అందుకేనోయ్ శాస్త్రుల్లూ, వాళ్లు ఏయే విషయాలలో మనతో పేచీలు పెట్టారో ఆ విషయాలన్నిటిలోనూ మనం పేచీలేకుండా పెళ్ళి చేసుకోవాలి. అప్పుడు నలుగురిలోనూ వాళ్ళకు తల కొట్టేసినట్లౌతుంది. అందరికీ మన సంగతి తెలుస్తుంది" అని తీర్మానించారు పంతులుగారు. బుచ్చిశాస్త్రి ఆయనతో ఏకీభవించాడు.

అసలు హనుమయ్యగారి బుర్రలో బుచ్చిశాస్త్రి అనే దాకా, పంతులుగారి సంబంధం తోచనేలేదు. సుమారు రెండేండ్లనుంచీ, తగిన సంబంధం కోసం వెతుకుతున్నారాయన. కానీ, ఆయన అంతస్థుకూ, హోదాకు తగిన సంబంధం దొరకనే లేదు. అప్పుడు బుచ్చిశాస్త్రి "మీ అంతస్థుకూ, హోదాకు తగినది పంతులుగారి సంబంధమేనండీ" అన్నాడు. అది విని ముందర చిందులు త్రొక్కారు. "ఆ దగాకోరుతో మళ్ళీ సంబంధం చెయ్యమంటావా? అతని నోటికి శుద్ధీ బద్ధీ ఉందీ, మంచీ, మర్యాదా ఏ కోశానైనా ఉందీ? చెప్పావులే మహా, సంబంధం!... అన్నారాయన చేతు లెగరేస్తూ

"బాబూ! ఒక్క విషయం మనవిచేస్తాను. మనం పిల్లనిచ్చేది, కొడుకైన సూర్యానికిగాని, తండ్రైన పంతులుగారికి కాదు. సూర్యం హిరణ్యకశిపుకి కడుపున ప్రహ్లాదుడిలా,

పంతులుగారికి అన్నిట్లో వ్యతిరేకంగా పుట్టాడు. బుద్ధిమంతుడు, సాత్వికుడు, కల్లాకపటం లేనివాడు. మీ అమ్మాయిని నెత్తి మీద పెట్టుకుంటాడు. పెళ్ళయ్యేదాకానే, మీకు పంతులు గారితో పని. ఆ తర్వాత అంతా సూర్యమే చూసుకుంటాడు" అని సూర్యంయొక్క గుణగణాల్ని వర్ణించి, మనోరమకు ఈడూ జోడూ కుదురుతుందని చెప్పాక హనుమయ్యగారు మెత్త పడ్డారు. సూర్యాన్నికూడా ఆయన ఎరుగును. మంచివాడే, పైగా పంతులుగారిది గొప్ప ఆస్తి. ఎలాలేదన్నా సూర్యం వాటాకు రెండు లక్షల రూపాయలు విలువచేసే ఆస్తి వస్తుంది. బుచ్చిశాస్త్రి చెప్పినట్లు, పెళ్ళయ్యేదాకా పంతులుగారితో అవసరం. తర్వాత అంతా సూర్యం ద్వారానే నడిపించాలి. అంతగా అవసరమైతే కొడుకుని తండ్రినుండి వేరుచేసి, తన ఇంట్లో ఇల్లరికం ఉంచొచ్చు మనోరమను సూర్యం ప్రేమించా డన్న సంగతి ఆయనకీ తెలిసింది సూర్యం ద్వారానే పంతులు గారికి తగిన పాఠం చెప్పచ్చు.

ఈ విషయంలో పంతులుగారి అభిప్రాయ మేమిటో కను క్కోమని, హనుమయ్యగారు బుచ్చిశాస్త్రిని నియోగించారు. పంతులుగారికి తమ సంబంధం చేసుకోడానికి ఎంతమాత్రం అభ్యంతరం లేదని తెలిసాక, హనుమయ్యగారు ఒక మంచి రోజున, టాక్సీలో సతీసమేతంగా బయల్దేరి సింగిపురం వెళ్ళి పంతులుగారితో తమ కూతుర్నిస్తానవడం, వారంగీకరించడం, తరువాత తాంబూలాలు పుచ్చుకుని ముహూర్తం నిర్ణయించు కోవడం జరిగింది.

పెళ్లింక ఇరవై రోజులుందనగా పంతులుగారు బంధువులందరి ఇళ్లకూ వెళ్లి చెప్పడం ప్రారంభించారు. "హనుమయ్యగారు మా పిల్ల పెళ్లిలో ఎన్ని పేచీలు పెట్టాడో మీకు తెలుసు. ఇప్పుడు చూడండి. వారి పిల్లని మేము ఎంత సౌమ్యంగా వివాహం చేసుకుంటామో. పెళ్లంటే ఇదే పెళ్లి! మీరు తప్పకుండా రావాలి సుమండీ. అసలు ముఖ్యమైన సంగతి కట్నం సంగతి ఇంతిమ్మని నేనడుగలేదు ఆయన చెప్పలేదు. ఆయన ఇచ్చిందే పుచ్చుకుంటాను". అని ఆడా మగా భేదంలేకుండా అందరితోనూ, కన్నుకొడ్తూ, వెకిలిగా నవ్వుతూ "వాళ్లకు ఈ దెబ్బతో బుద్ధివస్తుంది చూసుకోండి అహహ!- హనుమయ్యకేం తెలుసండీ, పెళ్లి చెయ్యడం అంటే? ముగ్గురు మగపిల్లల పెళ్లిళ్లు చూశాడు అంతేనా? ఇప్పుడు ఆడపిల్లల పెళ్లి చెయ్యమనండి, తెలుస్తుంది" అని చెప్పసాగాడు ఆయన మాటలు వినేవాళ్లుంటే, తన జీవితచరిత్ర అంతా అంటే తను ఎప్పుడెప్పుడు ఎవళ్లని కోర్టు కీడ్చి తిప్పలు పెట్టిందీ- వివరంగా చెప్తాడు. చాలా మందికి వినడం ఇష్టం ఉండకపోయినా, డబ్బున్నవాడుకదా అని, తమకు అతనితో ఎప్పుడైనా అవసరం రావచ్చునని, శ్రద్ధ నటిస్తూ, ఆయన కన్నుకొట్టడాన్నీ వెకిలి నవ్వునీ లోలోపల అసహ్యించుకుంటూ వింటారు

తన గొప్పతనం, కట్నం అడుగక పోవడంలోనూ, తనను అన్ని తిప్పలుపెట్టిన హనుమయ్యగారి కూతుర్నే మళ్లీ తన కొడుక్కి వివాహం చేసుకోదల్చుకోవడంలోనూ, ఏ విధంగా

ప్రదర్శితమౌతున్నదీ బంధువులందరికీ తెలియాలని, తను వేయించే శుభలేఖల్లో, పైన మామూలుగా వేయించే "జానక్యాః కమలామలాంజలి పుటే" అన్న శ్లోకం బదులు, "ఒరులేయవి యొనరించిన, నరవర యప్రియము తన మనంబునకగు దా నొరులకు నవి సేయకునికి, పరాయణము పరమధర్మ పథముల కెల్లన్" అను పద్యం వేయించాడు. చదివినవారంతా ఇది కొత్త పద్ధతిలా ఉందనుకున్నారు. పంతులు గారు తన సౌజన్యాన్ని ఎంత చాటుకోదల్చుకున్నా, బంధువులూ, స్నేహితులూ ఆయన్ను బాగా ఎరిగిన వారు కాబట్టి, ఇదంతా హనుమయ్య గారిని రెచ్చకెక్కించాలని చేస్తున్న ప్రయత్నమనీ, కట్నం అడుగకపోవడానికి కారణం, ఎలాగా హనుమయ్యగారు పది పన్నెండు వేలదాకా ఇవ్వదల్చుకున్న విషయం అందరికీ తెలిసిందే కాబట్టి వేరే అడుగనవసరం లేదనీ, పెళ్లయ్యాక పంతులుగారు కోడల్ని నానా హింసలూ పెట్టి, తన కూతుర్ని వాళ్లు పెట్టిన తిప్పలకు జవాబు చెప్తారనీ అనుకోసాగారు.

పంతులుగారు బంధువులందరికీ పై పద్యాన్ని మరీ మరీ చదివి వినిపించి, తను ఎంత సౌమ్యంగా ఈ పెళ్లికి ఒప్పుకున్నదీ చెప్తూవచ్చారు. పెళ్లిలో బొత్తిగా తగువులుండవనేసరికి కొందరు బంధువులు బాగా నిరుత్సాహపడిపోయి, "పోనిస్తూ, ఈ పెళ్లికి వెళ్లకపోతేనేం?" అనుకున్నారు. దానికి మరికొందరు, "అదేం మాట? హనుమయ్య–పంతులూ దెబ్బలాటల్లేకుండా ఎలా పెళ్లి చేస్తారు. అందులోనూ బుచ్చిశాస్త్రి సారధ్యం–

నీళ్లల్లో మంటలు పుట్టించగల మేధావి, అతను! ఈ పెళ్లిచూసి తీరాల్సిందే'' అని చిందులు త్రొక్కారు మరికొందరు వయసు మళ్లిన బంధువులు. మరీమరీ పెద్ద దెబ్బలాటలు జరగవచ్చునని వూహించి, ఎందుకైనా మంచిదనీ, అయిడినూ, బాండేజీలతో సహాసిద్ధమయ్యారు.

హనుమయ్యగారు చాలా కోలాహలంగా పెళ్లి ఏర్పాట్లు చేయించారు. తమ మేడని, అడుగడుగునా కాగితం పూలతోటీ, మెర్కురీ దీపాలతోనూ అలంకరించారు. ఈ నాల్రోజులూ, భోజనాలూ, కాఫీ టిఫిన్లూ,...పెద్దహోటలువారికే కాంట్రాక్టు ఇచ్చేసారు. పందిరీ, పెళ్లి మండపం అలంకరణా, కన్నులు మిరుమిట్లుగొల్పేటట్లున్నాయి. లగ్నం ఆ రోజు రాత్రనగా, ప్రొద్దున్నే పెళ్లివారు స్పెషల్ బస్సుల్లో దిగారు. వారి ఏర్పాట్లన్నిచూసి, ప్రొద్దుటి తతంగమంతా జరిపించి, హనుమయ్యగారు పెళ్లివారికెటువంటి లోటుపాట్లు లేకుండా చూసుకోసాగారు. పంతులుగారికి, కట్నంగురించి హనుమయ్యగారు ఏమీ అనడేమా? అన్న ఆలోచన పట్టుకుంది.

సాయంకాలం ప్రధానం జరిగింది. పంతులుగారు శాస్త్రిని పక్కకు పిల్చి, "కట్నం సంగతేమిటోయ్.' అనడిగారు, కన్నుకొట్టూ. దానికి బుచ్చిశాస్త్రి "నాతోనూ ఏమీ అనలేదండీ. వాలకం చూస్తే లగ్నకాలమందే ఇచ్చేటట్లుంది. అప్పుడే ఆ సంఖ్య తేలుతుంది." అన్నాడు.

"అయితే సరేలే:' అన్నారు పంతులుగారు. లగ్నం రాత్రి రెండుగంటలకు. ఒంటిగంటకే వివాహమండపం చుట్టూ వున్న ఆవరణంతా, అతిథులతో నిండిపోయింది. విద్యుద్దీపాలతో కాంతీ, భాజాభజంత్రీల ధ్వని, నవనాగరిక యువకులూ, పట్టు చీర్ల యువతులూ తిరుగుతూంటే ఏర్పడే శోభా, పురోహితుని మంత్రాలూ, మంగళ స్నానంచేసి ఠీవిగా కూర్చున్న పెళ్లి కొడుకూ, సిగ్గుతో తలవంచుకున్న పెళ్లికూతురూ, అన్నీ నయనా నందకరంగా ఉన్నాయి. ముహూర్తం సమీపిస్తునకొద్ది పంతులుగారి గుండెల్లో గుర్రాలు పరిగెత్తసాగాయి. కట్నం! ఎంత!—— ఇదే ఆయన ప్రశ్న : పదివేలా—పదిహేను వేలా—పాతిక...ఏమో! ఒక్కతే కూతురూ, అపురూపం కాబట్టి, పాతిక వేలివ్వొచ్చు.

ముహూర్తం అయిపోయింది. భాజాభజంత్రీ ఒక్కసారి హోరుమన్నాయి. మళ్లీ ఆగిపోయాయి. బుచ్చిశాస్త్రి మంత్రాలు చదవడంఆపి, "శ్రీహనుమయ్యగారు...కన్యాదాన కాలమందు..." అంటున్న మాటలు విన్పించాయి పంతులు గారికి. 'హమ్మయ్య!' అనుకున్నారు. ఇహ ఇప్పుడు కట్నం సంగతి తేలుతుంది. శ్రద్ధగా బుచ్చిశాస్త్రి మాటలు విన సాగారు. "తమఅల్లుడికి హనుమయ్యగారు సమర్పించు కట్నం వెయ్యినూట పదహార్లు...." పంతులుగారికి ప్రపంచం గిర్రున తిరిగినట్లైంది. "ఆ!" అన్నారు.

"వెయ్యినూట పదహార్లా?" అని అరచారు. బుచ్చి శాస్త్రి హనుమయ్యగారూ ఆయనవైపు చూసి, 'అవును' అన్నారు. పంతులుగారు రౌద్రాకారం దాల్చారు. "మరి వెయ్యి రూపాయలా ? చాల్చాలు. సూర్యం లేచిరారా ?" అని అరచారు. అంతా అల్లకల్లోలమైపోయింది. హనుమయ్య గారు, "ఏం ? నువ్వింత ఇమ్మని అడిగావా ? అడగలేదు కాబట్టి నే నివ్వదల్చుకోలేదు. నా కూతురు వంటిమీద పదిహేను వేల రూపాయిలు బంగారం పెట్టాను. నువ్వడిగితే అదేకట్న మిద్దును" అన్నారు. దానికి పంతులుగారు "ఇదంతా మీరాడిన నాటకం అన్నమాట. పదివేలకు తక్కువ గాకుండా కట్నం ఇస్తానని, బుచ్చిశాస్త్రిచేత చెప్పించి ఇప్పుడిలా ఎగ్గొట్టారా ? మాకీ పెళ్లే అక్కర్లేదు. సూర్యం, రారా !" అన్నారు. పెండ్లి చూడటానికి వచ్చిన వాళ్లంతా, ఇద్దర్నీ శాంతింపజెయ్యాలని చూశారు గాని వియ్యంకులిద్దరూ ఏ తమాత్రం ఆగక ఒకరి నొకరు విపరీతంగా దూషించుకోవడం మొదలెట్టారు. మధ్య వర్తులు కలుగజేసుకుంటే "ఆ పదిహేనువేలూ కట్నం ఇవ్వ మనండి" అని పంతులుగారు, "కట్నం మాటెత్తవద్దనండి" అని హనుమయ్యగారు అరవ నారంభించారు, పంతులుగారు "లేచి రావేమిరా సూర్యం ? రా !" అని గట్టిగా అరిచేసరికి, పెళ్లికొడుకైన సూర్యం లేచి నిల్చున్నాడు. అందరూ అతనివైపు చూశారు. "నాన్న గారూ !" అని పిల్చాడు.

'నాన్నగారూ! శుభలేఖల్లో 'ఒరులేయవి యొనరించిన అప్రియము, దా నొరులకు నవి సేయకునికి పరమ ధర్మము' అని వేయించారు కదా. వాళ్లది మోసబుద్ధయితే ఆ అగౌరవం వాళ్లకే ఉండనివ్వండి. మనం వాళ్ల కోవలో చేరడ మెందుకూ? మనం చెప్పుకున్నట్లు మనం ఆచరిద్దాం'' అన్నాడు. అది విని హనుమయ్యగారు, "బాగా చెప్పావు నాయనా" అన్నారు, అందరూ అవునన్నారు. పంతులుగారు "నోర్ముయ్!" అన్నారు. "సిగ్గులేక కట్నంలేని పెళ్లి చేసుకుంటావా? రా! ఇవతలికి'' అని కేకేశారు. పెళ్లికూతురు నిల్చుంది. "మామ గారూ! మీ రడుగలేదు కాబట్టి, ఇవ్వలేదని మా నాన్నగా రన్నారు, ఇప్పుడడిగారు గాబట్టి ఈ బంగారమంతా కట్నం క్రింద ఇచ్చేస్తున్నాను. తీసుకోండి. మీ పంతాలు మానండి'' అని మనోరమ తన నగలుతీసి శాస్త్రికిచ్చి, కట్నం క్రింద చదివించమంది. హనుమయ్యగారు నిర్ఘాంతపోయారు. పంతులు గారూ కన్నుకొట్టూ "ఏమిటే?'' అంటూ, బుచ్చిశాస్త్రి చదివింపు వినసాగారు.

పెండ్లికొచ్చిన అతిథులంతా మనోరమను మెచ్చుకున్నారు. సూర్యం, ఆశ్చర్యంతోనూ, మెప్పుదలతోనూ మనోరమను చూస్తూంటే, ఆమె తల వంచుకుని క్రీగంట అతనితో చూపు కలిపింది.